215098601

# ప్రబోధ 21

స్వర్గమన్న పరలోకమునలేదు
నరుల లోకమందె అమరియుండు
సద్గుణంబులు కల్గి సరియైన నడతున్న
అదియె స్వర్గమగును అవనియందు.

భారతీయ సంస్కృతికి వేద ఉపనిషత్తులే మూలము. సంగీతమునకు సాహిత్యమునకు వేదములే మూలకారణము. సామవేదము నుండియే సంగీతము ఆవిర్భవించింది. ఋగ్వేదము నుండియేర్పడినదే సాహిత్యము. భక్తి పూరితమైన సంగీతమే భగవంతుని యొక్క స్వరూపము కనుకనే

నాహం వసామి వైకుంఠే న యోగి హృదయే నవం
మద్భక్తాః యత్ర గాయన్తి తత్ర తిష్ఠామి నారద

అన్నాడు నారాయణుడు. నేను వైకుంఠము నందుగానీ లేక ఏ యోగుల హృదయమునందుగానీ నేను నివశించుటలేదు. మద్భక్తాః యత్ర గాయన్తి. ఎక్కడ నాభక్తులు నన్ను స్మరించుచుందురో అక్కడ నేను ప్రతిష్ఠుడై వుంటాను అన్నాడు. భగవంతుడు భక్తుల హృదయమునందు మాత్రమే కాక దుష్టుల హృదయమునందు కూడను తాను వుంటున్నాడు. తాను తరించి పరులను తరింపచేయగోరునట్టి మానవుడే నిజమైన మానవుడని నిరూపించింది వేదము. సర్వాంతర్యామియైన భగవంతుడు సర్వుల హృదస్థాయియై, సర్వ మానవత్వాన్ని రంజింపజేయుచు దివ్యత్వమును ప్రకటింపచేస్తూ వుంటాడు.

ప్రహ్లాదుడు ఒకానొక సమయమున తన తల్లియైన లీలావతి దగ్గరకు వచ్చి అమ్మా హరిప్రియుడైన నాకును, హరిద్వేషియైన నా తండ్రికిని వున్నది ఒక్కటే బోధము అన్నాడు. నేను భగవంతుని ప్రేమిస్తూ స్మరిస్తూ అతని ప్రేమ రసామృతమును గ్రోలి నా హృదయమును నింపుకొని మత్తుడై, ప్రేమోన్మత్తుడై, తన్మయత్వుడై, తాదాత్మ్య భావనలో ఆనందాన్ని అనుభవిస్తున్నాను అన్నాడు. నా తండ్రియైన హిరణ్యకశిపుడు నారాయణుని ద్వేషించి తన హృదయమును కఠినమైన శిలగా మార్చుకొని ఆ శిలయందే నారాయణుని ప్రతిష్ఠ చేసుకున్నాడు. హరిని ద్వేషించిన హిరణ్యకశిపుని హృదయమునందును, హరిని ప్రేమించిన ప్రహ్లాదుని హృదయమందును వున్నది ఒక్కడే హరి. ద్రవరూపమైన ప్రేమను ఆరగించి

దాహమును తీర్చుకొని తనయొక్క తాపమును చల్లార్చుకున్నాడు ప్రహ్లాదుడు. కఠినమైన హృదయమునందు హరిని ప్రతిష్ఠ చేసుకొని తాను తన తాపమును చల్లార్చుకొనలేక దాహమును తీర్చుకొనలేక తాను అనేక విధములైన అవస్థలకు గురయ్యాడు హిరణ్యకశిపుడు. నమ్మి బ్రతుకు అన్నారు మానవులు. నమ్మిక గలిగిన మానవునికే ఒకవిధమైన ఆనందము లభ్యమవుతుంది. ఆనందమును లభ్యము గావించుకున్న మానవుడు అశాంతికి దూరమవుతాడు. అశాంతి దూరమైనప్పుడు శాంతి సుఖములు అనుభవిస్తాడు. కనుక దైవత్వము సర్వవ్యాపి అనే సత్యాన్ని గుర్తించుకున్నప్పుడే గాయకులు, పరమ భక్తులు దైవత్వాన్ని విస్మరించక స్మరించి, విశ్వసించి తన యొక్క జీవితము సార్థకము గావించుకుంటారు. దైవము లేని స్థానము లేదు. దైవముది కాని నామము లేదు. భాగవతమునందు ప్రహ్లాదుడు కూడను

ఇందుగలడందు లేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెదకి చూచిన
నందందే గలడు దానవాగ్రణి వింటే!

త్యాగరాజు చెప్పాడు 'ఏ తావునరా నిలకడ నీకు' ఎక్కడ చూచినా నీవు వుంటున్నావు నీకు నిలకడనే లేదు. సర్వవ్యాపకుడవు. సర్వాంతర్యామివి, సర్వజ్ఞుడవు, సర్వశక్తిమయుడవు అని వర్ణిస్తూ వచ్చాడు. కేవలము మానవులయందు మాత్రమే కాక పశుపక్షి మృగాదులయందు కూడను దైవత్వము ఆవరించి వున్నాడు. ఈ సత్యమును గుర్తించిన త్యాగరాజు

రామ చిలుక నొకటి పెంచి ప్రేమ మాటలాడ నేర్పి
రామ రామ రామా యనుచు రమణి ఒకతె
ఎన్నగా శ్రీరామ భజన కన్న మిక్కిలున్నదా

దైవత్వమనేది సకల భూతములందు కూడను వుంటుండం చేతనే అపరంజి రామచిలుకను పెంచి రామరామ అని ప్రేమ మాటలు నేర్పినప్పుడు ఆ రామ చిలుక కూడను రామ రామ అని స్మరించినట్లుగా త్యాగరాజు వర్ణిస్తూ వచ్చాడు.

బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి. బ్రహ్మ తత్త్వమును గుర్తించిన వాడు బ్రహ్మనే తాను అవుతాడు. వాల్మీకి నిరంతరము రాముని స్మరించుచూ, చింతించుచూ రామాయణము లిఖిస్తూ వచ్చాడు. కనుకనే వాల్మీకి యొక్క ముఖ తేజస్సు రామప్రతిబింబముగా దర్శిస్తూ వచ్చారు ఆశ్రమ వాసులు. మనస్సున యెట్టి పవిత్రమును చింతించునో వాని ముఖమున అట్టి ప్రకటితము కావిస్తు వుంటాది అట్టి అంతర్ శక్తి. Reflection of the inner being మానవుని యొక్క ముఖము. కనుకనే రామ

చింతన చేత రమింప చేసుకున్న యొక్క దివ్యతేజస్సుతో కూడినవాడు వాల్మీకి. మోజెస్ నిరంతరము భగవంతుని చింతించటం చేతనే తన యొక్క ముఖము దైవకళగా దైవ తేజస్సుగా వికసిస్తూ ప్రకటిస్తూ ప్రకాశిస్తూ వచ్చింది. ఇది బైబుల్ యొక్క ప్రకటితము. డార్విన్ అనే ఒక వ్యక్తి తాను విద్యార్థిగా వుండిన సమయములోపల Henslow అనే గురువు దగ్గర తాను విద్యనభ్యసిస్తూ వచ్చాడు. ఆ అధ్యాపకుడు పరమ పవిత్ర హృదయుడు. నిస్వార్థ ప్రియుడు. నిరహంకార మయుడు. నిశ్చల చిత్తుడు అట్టి గురువును ఆశ్రయించిన డార్విన్ నిరంతరము గురువువలె నేను కూడను యీ స్థితిని అనుభవించాలి అని నిశ్చింతన చేస్తూ వచ్చాడు. యద్భావం తద్భవతి. మానవుని యొక్క భావములను పురస్కరించుకొనియే తన ఫలితము కూడను ఆశ్రయించి వుంటాయి. కట్టకడపటికి తన చిరకాల వాంఛను తీర్చుకోగలిగాడు. డార్విన్. డార్విన్ కూడ నిశ్చల చిత్తుడు, నిస్వార్థపరుడు, నిరహంకార మయుడు యీ విధమైన తేజస్సుతో తాను ప్రకాశిస్తూ వచ్చాడు ప్రజల ముందు కడపటికి దైవము ఒక్కడే అనే సత్యాన్ని కూడను గుర్తించుకుంటూ వచ్చాడు. కనుక దైవమును ఎదురుగా వుండినట్లుగా భావించి నేను లేక నీవు లేవు అన్నాడు. దైవము లేక భక్తుడుగానీ, భక్తుడు లేక దైవముగానీ వుండుటకు వీలుకాదు. భక్తుడు, భగవంతుడు అవినాభావ సంబంధముతో కూడిన అన్యోన్య ఆశ్రయముతో చేరిన ఏకత్వ స్వరూపుడు. భక్తుడు ప్రేమోన్మత్తుడై, తన్మయత్వములో వుండినప్పుడు, తాదాత్మ్య భావన పొందినప్పుడు ఏకత్వమును పొందగలుగుతాడు.

అట్టివాడే పరమ భక్తుడైన ప్రహ్లాదుడు. వంశము రాక్షస వంశము. రూపము మానవ స్వరూపము. చిత్తము దైవ చిత్తము. యీ మూడింటి యేకత్వమును పొందిన పవిత్ర స్వరూపుడే ప్రహ్లాదుడు. ఈ ప్రహ్లాదుడు నిరంతరము భారతీయ సంస్కృతిని ఆశ్రయించుచు తుచ దానిని అనుసరిస్తూ ఆదర్శముగా ప్రజలకు అందిస్తూ వచ్చాడు. పురుషార్థములు నాలుగు ధర్మ అర్థ కామ మోక్షములని. ధర్మమును ధర్మముగానే వదలక ధర్మమున్న స్థానమునుండి అర్థము ప్రదేశమునకు తీసుకొనిపోయి అర్థమును ధర్మమయముగావించిన సద్భక్తుడు ప్రహ్లాదుడు. ధర్మార్థములు రెండింటిని యేకత్వము గావించి ఆస్థానమునుండి కామము కూడను నడిపించిన వ్యక్తి. అర్థకామములు రెండింటిని ధర్మమయము గావించి తాను ప్రశాంత స్థితి యందుండినప్పుడు మోక్షమే తనను వరించుకుంటూ వచ్చింది. దానవ వంశమునందు జన్మించినప్పటికిని ధర్మార్థకామ మోక్షములందు సార్థకము గావించుకున్నట్టి మహా పవిత్ర వ్యక్తులు ముగ్గురు మాత్రమే వుంటుండినారు. బలిచక్రవర్తి, ప్రహ్లాదుడు, విభీషణుడు. మానవులై జన్మించి కూడను ధర్మ మోక్షములను విస్మరించి అర్థ కామము

లండే జీవితము గడిపి జీవితము వ్యర్థముగావించుకున్న మానవులు అనేకమంది వుంటున్నారు. పరమ భక్తుడైన ప్రహ్లాదుని కుమారుడే విరోచనుడు. కాని విరోచనుని యొక్క తత్త్వము విరుద్ధముగా మారిపోయింది. విరోచనుని భావములు హేతువాదములు. చార్వాకము యొక్క తత్త్వము విరోచనుని యొక్క తత్త్వము. ఆ విరోచనుని యొక్క కుమారుడే పరమ పవిత్రుడైన బలిచక్రవర్తి. ఈ బలిచక్రవర్తి ప్రహ్లాదుని యొక్క మనుమడు. ఈ బలిచక్రవర్తి ప్రజలను కన్న బిడ్డలవలె పాలించెడివాడు. ప్రజలయొక్క ప్రేమకు, మన్ననలకు పాత్రుడైనవాడు. ప్రజలే బలిచక్రవర్తి యొక్క దేహ అంగములుగా భావించుకున్నవాడు. ప్రజలు బలిచక్రవర్తిని దేహమునందు గుండెవలె విశ్వసించినవారు. ఆప్రజలకు, ఆ చక్రవర్తికి సరియైన సాటిగా వుండేవారు.

ఒకనాడు బలిచక్రవర్తి విశ్వజిత్ యాగమును ప్రారంభించాడు. లోకములో మంచివారిని చూచి, పవిత్రులను చూచి, అధికస్థాయి యందు వున్నవారిని చూచి కొన్ని విధములైన కుట్రలు పన్ని యీ మంచివారిని చెడుపుటకు అనేకప్రయత్నములు చేస్తూ వుంటారు కొంతమంది. ఇట్టివి యుగయుగములనుండి కూడను జంటపక్షులవలె వెంటాడుతూ వస్తుంటాయి. రామావతారమునందు అనేక విధములైన అసూయాపరుల చేతను హింసించబడుతూ వచ్చాడు. హరిశ్చంద్రుని యొక్క సమయమునందు కూడను అనేకమంది ఋషులయందే ఒక దుర్భావము బయలుదేరి హరిశ్చంద్రుని పరీక్షచేసి అతనిని బాధించాలని ప్రయత్నించారు. ధర్మమూర్తులైన పాండవులను చూచి కౌరవులు కండ్లెర్రచేసుకున్నారు. త్యాగమయుడైన జీససును చూచి కొంతమంది అసూయాపరులు అతనిపైన కత్తిని కట్టారు. సర్వమత సమ్మతమే తన యొక్క అభిమతముగా విశ్వసించిన మహమ్మదును చూచి మక్కాకు రానివ్వకుండా అతనిని పరాభవము గావించి ప్రక్కకు తోలగొట్టారు. అన్ని కాలములయందు, అన్ని మతములయందు యీ విధమైన అసూయాభావములు చెలరేగి అనేకవిధములైన అశాంతిని అభివృద్ధిపరచి సమాజము లోపల కొంచెము అలజడులు అభివృద్ధి గావించారు.

ఇక్కడ బలిచక్రవర్తి ప్రజలపైవుంచిన అభిమానము చేతను ప్రేమచేతను ప్రజలయొక్క క్షేమమును ఆశించి యావత్ప్రపంచమంతయు కేవలము ఒక బలిచక్రవర్తి ప్రపంచముగా మారాలని విశ్వజిత్ విశ్వమును జయించినవాడుగా తయారు కావాలని, విశ్వమంతయు కూడను సుఖశాంతులతో భద్రతలతో తులతూగాలని తాను సంకల్పించుకున్నాడు. ఈ యాగమును తిలకించిన దేవతలలో కూడను ఒక అసూయా భావము ప్రారంభమైంది. వీరందరు నారాయణుని చేరి స్వామి!

215098605

రాక్షసుడైన బలిచక్రవర్తి విశ్వమునే స్వాధీనము చేసుకొని దేశమునంతయు రాక్షసమయముగావించవచ్చును. కనుక మమ్ములను రక్షించి అతని యొక్క అభీష్టము నుంచి వేరుగావించే విధానమును మీరు సంకల్పించాలి అని ప్రార్థించారు. మానవులు సంకుచిత హృదయులు. తానొకటి తలచిన దైవమొకటి తలచును అనే సత్యమును గుర్తించుకొనలేక పోతున్నారు. నారాయణుడు అంగీకరించినట్లే అంగీకరించి బలిచక్రవర్తి యొక్క పవిత్ర హృదయాన్ని పరిశీలన చేసి పరమభక్తుడని విశ్వసించి అతనిని యే విధముగానైనా స్వర్గమునకు పంపించాలనే సత్సంకల్పాన్ని తాను చేసుకున్నాడు.

ఈ సంకల్పానుసారముగా వామనమూర్తియై సిద్ధాశ్రమమున జన్మించాడు. వామనమూర్తి దానమును గోరి యజ్ఞములో ప్రవేశించాడు. నిర్మలహృదయుడు, నిస్వార్థపరుడు కనుక బలిచక్రవర్తి వామనమూర్తి యొక్క తేజస్సు చక్కగా దైవముగా గుర్తించుకోగలిగాడు. 'స్వామీ! ఈ యజ్ఞసమయమందు తమ యొక్క కోరిక యేమిటి నేను సర్వసంగ పరిత్యాగినై సర్వులకు దాన ధర్మములను గావించి నా యొక్క జీవితము సార్థకము గావించుకోవాలని సంకల్పించుకున్నాను అన్నాడు. వామనమూర్తి చాలా చిన్నవాడు. పిట్టకొంచెము. కూత ఘనము. అడిగిన కోరిక చాలా చిన్నది గాని అందులోనే అనంతమైన జగత్తు ఇమిడి వుంటున్నది. 'అయ్యా! బలిచక్రవర్తీ నాకు అధిక దానమక్కరలేదు. మూడడుగులు భూమి మాత్రము ఇస్తే చాలన్నాడు.

బ్రహ్మాండమంతయు ప్రబలుచుండెడి తనకు
మూడడుగుల నిచ్చుట ముఖ్యమగున

కానీ యీ వామనమూర్తి త్రివిక్రమ అవతారము ధరించాడు. ప్రపంచమునంతయు ఒకటి పాదములో చేర్చుకున్నాడు. ఆకాశమును మరొక పాదములో తొక్కుకున్నాడు. బలిచక్రవర్తీ! మూడవ పాదమునకు స్థలమేమైనా చూపగలవా అన్నాడు.

ఏ హృదయమును ఒసగితివా యీశ నాకు
మరి దానినే అర్పింతు మహితమూర్తి
పరగ వేరేమి తెత్తు నీ పాదార్చనకు

ఇదుగో శిరస్సు దానిపైనే మూడవపాదము పెట్టుకోమన్నాడు. అనగా తన సర్వస్వమును అర్పితము గావించుకున్న త్యాగమూర్తి యీ బలిచక్రవర్తి. యజ్ఞములు గావించుచున్న బలిచక్రవర్తికి అకస్మాత్తుగా యీ విధముగా పాతాళ లోకమునకు త్రొక్కటం చేత ప్రజలు చాలా దుఃఖించి పోయారు.

పాతాళలోకమునకు పోవుటకు పూర్వము వామనమూర్తిని ఒక కోరిక

215098606

కోరాడు బలిచక్రవర్తి. స్వామి! నేను నా జీవితమును త్యజించి స్వర్గమును చేరుకోటం నాకు సంతోషమే కానీ యేవిధమైన సంకల్పములు లేకుండా ప్రజలను నిరాశపెట్టి వారిని దుఃఖింపచేయటము నాకు యిష్టము లేదు కనుక ప్రతి సంవత్సరము శ్రావణమాసము, శ్రావణా నక్షత్రమందు నాప్రజలను నేను చూచుకోటానికి వచ్చే అవకాశము అనుగ్రహించమని కోరాడు. సంవత్సరమునకు ఒక పర్యాయము నాప్రజలను నేను చూడాలని యీప్రజాభిమానము చేత తాను యీ కోరికను కోరుకున్నాడు.

కనుక బలిచక్రవర్తిపైనుండిన ప్రజల యొక్క అభిమానము యొక్క గుర్తే యీ ఓనం. ఈ ఓణం రోజు కేరళ ప్రజలందరు తెల్లవారగనే అభ్యంగనస్నానము లాచరిస్తారు. శ్రావణామునకు చిఙ్గం అని మళయాళములో ఒక పేరు వుంటుండాది. ఆనాడు కొత్త వస్త్రములు ధరించి వారు ఆనాడు అనేక విధములైన మధుర పదార్థములను చేసి దానిని ఒక అరటి ఆకులో వుంచి మొదట బలిచక్రవర్తికి నివేదన చేసి తదుపరి బంధుమిత్రులతో వైభవముగా యీ ఓణమును జరుపుకుంటారు. కొత్త వస్త్రములకు ఓణాపుపాడి అని మళయాళములో అంటారు. ఇది ఓణామునకు సరైన అర్థముగా గుర్తిస్తూ వచ్చారు. కొత్త వస్త్రమనగా ఏమిటి? కేవలము దేహమునకు ధరించిన కొత్తవస్త్రమే కాదు. దీనికి అంతరార్థము కూడను వుంది. బలిచక్రవర్తి నూతనదేహమును ధరించాడు సనాతనమైన దైవత్వము నూతనమైన శరీరము ధరించినట్లుగా యీ యొక్క పాతాళలోకమునకు తొక్కబడి బలిచక్రవర్తి సంవత్సరమునకొక పర్యాయము ప్రజాభిమానమనే దేహమును ధరించటము చేత యిదొక నూతన వస్త్రముగా భావించుకుంటూ వచ్చింది శాస్త్రము. సాక్షాత్ భగవంతుని యొక్క అభిమానమును ప్రేమను చూరగొన్న దేశమే కేరళదేశము. నిజముగా ప్రేమాభిమానములు అన్నివిధముల అనుభవిస్తూ వచ్చారు ఆనాడు.

ఈ కేరళ దేశమునకు మరొక పేరు కూడను వున్నది. పరశురామక్షేత్రమని. దీనికి యీపేరు ఎందుకు వచ్చింది. పరశురాముడు కూడను ఒక అవతారపురుషుడు. తన తండ్రిని రాజులు శిరచ్ఛేదనము చేయుట చేత ఆదృశ్యమును చూచి తల్లి రేణుక కుమారుడు దగ్గర లేని సమయములో చూచి ఓ రామా! రామా అని కేకలు వేసింది. నిర్మల చిత్తము కలిగిన వ్యక్తికి, నిస్వార్థమైన భావము కలిగిన వ్యక్తికి ఎంత దూరములో ఏవిధమైన ప్రదేశములో తాను పిలిచినప్పటికిని వారికి విద్యుశ్శక్తి తరంగములచేత, శబ్దతరంగముల చేత, జ్యోతిర్మయమైన తరంగముల చేత అది సన్నిహితమై వుంటుంది. ఎక్కడో వుండిన పరశురామునికి తల్లి కంఠము వినిపించింది. మాతృభక్తి కల్గిన పరశురాముడు కనుక తల్లి కంఠమును చక్కగా ఏకాగ్రత పరుస్తూ వచ్చాడు

215098607.

ఎన్ని పర్యాయములు పిలిచింది. ఈమె జమదగ్ని యొక్క కంఠమును కోస్తుంటే ఆదృశ్యమును చూడలేక రామా! రామా! రామా! యీ విధముగా యిరువది ఒక్క పర్యాయములు పిలిచింది. ఇంటికి వచ్చి చూచేటప్పటికి ఆశ్రమములో తండ్రి మొండెము, శిరస్సు వేరై వున్నది. ఇది కార్తవీర్యుని కుమారుడు చేసిన క్రూర కర్మ. నాతల్లి యొక్క హృదయాన్ని శాంత పరచాలనుకుంటే ఎన్ని పర్యాయములు నన్ను పిలిచిందో అన్ని పర్యాయములు యీ క్షత్రియులపైన యుద్ధము చేసి యావత్ క్షత్రియులను ధ్వంసము చేస్తానని ప్రతిజ్ఞ చేశాడు. కనుక యిరువది ఒక్క పర్యాయములు యుద్ధము చేసి రాజ్యము నంతయు కూడను సాధించి, క్షత్రియుల నందరిని నాశనము చేశాడు. తిరిగి ఆవేశమును, ఆవేదనను కొంత చల్లార్చుకొని తండ్రి దగ్గరకు వచ్చి ప్రార్థించాడు. ప్రార్థించేటప్పటికి తండ్రి యొక్క పూర్వీకులు, వారిది భారద్వాజ వంశము, భారద్వాజుడు వచ్చి ఆ తండ్రి యొక్క శిరస్సును చేర్చి అతనికి ప్రాణమిచ్చాడు. (జమదగ్ని). తాను వచ్చిన కార్యము పూర్తి యైనదని తలచుకున్నాడు తదుపరి తాను జయించిన రాజ్యమునంతను తాను పాలించే భావము లేక పోవటము చేత కశ్యపుడనే బ్రాహ్మణునకు దానము యిచ్చాడు రాజ్యము నంతా. తాను దానమిచ్చిన స్థానము తాను వుండటం ధర్మం కాదనుకున్నాడు. కనుకనే యీ పరశురాముడు సముద్రమును శోధించి అక్కడ ఒక గట్టును యేర్పరచుకొని ఆ గట్టు లోపల ఒక గ్రామము నిర్మించుకున్నాడు. అదే పరశురామ క్షేత్రము. దక్షిణా భారత దేశమందు కేరళ దేశము పరశురామ క్షేత్రమని పేరు ప్రఖ్యాతి అయింది. అక్కడనే సమీపములో వుండిన మహేశ పర్వతమునకు వెళ్ళి తాను తపస్సు చేసుకుంటూ కూర్చున్నాడు. అది కూడను యీ కేరళ రాజ్యమందే వుంటున్నది. కనుక కేరళ రాజ్యమనగా చాలా పవిత్రమైన దేశము.

ఈ ఓణము సరైన సమయము లోపల యేర్పడుతు వచ్చింది. మూడు నెలలు కుండపోతగా వర్షములు ప్రారంభమవుతాయి. కేరళలో యీ వర్షము చేత ప్రకృతి అంతయు కొంత స్తంభించి పోతుంది. సూర్యోదయము అరుదుగా వుంటుంటాది. ఈ వర్షములు నిలచి పోయి సూర్యుని యొక్క కిరణముల చేత ప్రకృతిని పవిత్రముగావించి యిక్కడ చూచినప్పటికిని పచ్చని పంటల చేతను, నీలమేఘమైన స్వరూపము చేతను కళకళలాడుతూ వుంటుంది రాజ్యము. కనుక ప్రకృతి కూడను ఆనందించే సమయము యీ సమయము. ప్రకృతి తన సహజ సౌందర్యమును ధరించి ప్రజలకు కూడను సహజానందము నందించే చక్కని అవకాశము యీ ఓణము యొక్క సమయము. పాడి పంటలతో, ధనధాన్యములతో పండ్ల ఫలములతో దేశము చాలా సౌందర్యముగా వుంటుంది. యీ సమయమునందు ఆ

215098608

కేరళ దేశము చూచి చెప్పవలెనుగాని వర్ణించుటకు వీలుకాదు. ఇది కేవలము దైవము యొక్క సంబంధమైన దేశము యీ కేరళ దేశము.

కానీ అట్టి పవిత్రమైన దేశమున కాలానుగుణ్యముగా కొన్ని కొన్ని పరిస్థితులు మార్పు చెందుతూ వచ్చాయి. దేశకాలపరిస్థితుల ప్రభావము చేత మానవుల యొక్క మనసులు కూడను మారుతూ వచ్చాయి. మనిషికి మనిషికి మధ్య ద్వేషములు అభివృద్ధి అవుతూ వచ్చాయి. మనసుకు మనసుకు మధ్య దట్టమైన అజ్ఞానమనే మేఘములు ఆవరిస్తూ వచ్చాయి. ఈ విధమైన వాతావరణము మార్పుచేతను మనిషి యొక్క తత్త్వము కూడను మారుతూ వచ్చింది. ఎంత మారినప్పటికి భక్తిప్రపత్తులు యేమాత్రము మారలేకుండా పోతున్నాయి. ఇది కేరళలో రాజ్యాంగ రీతిగా చూచినప్పుడు యిది కమ్యూనిష్టు ప్రదేశము, కమ్యూనిష్టు రాజ్యమనుకుంటాము. కాదు. కాదు. హృదయములు యీనాటికీ కూడను పవిత్రమైన భగవద్భక్తితో లీనమై వుంటున్నాయి. ఈ ఓణము దినము ఎవ్వరైనను యీ ప్రేమమయమైన పండుగలో ప్రవేశించని వాడు కేరళలో వుండనే వుండడు. ప్రతి వ్యక్తి కూడను తాను స్నానము చేసి గంధమును ధరించి యీ ఉత్సవములో యేయే కార్యక్రమములలో పాల్గొనాలో ఆవిధముగా పాల్గొంటారు. దేవాలయములలో చూచినప్పుడు కిక్కిరిసి వుంటారు ప్రజలు. రాజకీయ తంత్రాలవల్ల పై భేదములు కనుపిస్తున్నాయిగాని అంతర భేదములు యేమాత్రము కూడను కనుపించటంలేదు. ఇవి స్వార్థము స్వప్రయోజనముతో సంబంధించినవి మాత్రమే. హృదయమునందు భక్తిప్రపత్తులు హత్తుకొని వుంటున్నాయి. జీవుడెవరు? దేవుడెవరు? అనేటి ప్రశ్నకు వచ్చినప్పుడు కదిలేది జీవుడు కదలనది దేవుడు అన్నారు. నిరంతరము మార్పు చెంది చంచలత్వముతో కూడినది జీవతత్త్వము. మారేది జీవుని లక్షణము. మారనిదే దైవతత్త్వము. కనుక కొన్నివేల సంవత్సరములైనప్పటికిని కేరళలో యీవిధమైన భగవద్భావము మారని యేకత్వముగా వుండే దివ్యత్వము.

ఈ ఓణము యొక్క మహాత్మ్యము యిట్టిది అట్టిదని చెప్పుటకు వీలు కాదు. పరమ భక్తుడైన, తాతయైన ప్రహ్లాదుడు, మనుమడైన బలిచక్రవర్తి యొక్క చరిత్రకు రెండింటి యొక్క మధ్యలోపల యిక్కడ తాతకు మనుమునికి మధ్యనున్నవాడు తండ్రి అతనే విరోచనుడు అతనే హేతువాది. ఈ నాస్తికత్వము అక్కడ నుండి వచ్చింది. కనుకనే The pleasure is an interval between two pains. రెండు మంచి యొక్క మధ్యలో ఒక చెడ్డ చేరి వుంది. ప్రహ్లాదుడు పరమ భక్తుడు. బలి మహా భక్తుడు. మధ్యలో కొంచెము భక్తిహీనమైన వాడే యీ విరోచనుడు. లోకములో ప్రహ్లాదుని యొక్క సంతతి పెరుగుతూ వస్తున్నాది. మధ్యమధ్య విరోచనుని యొక్క సంతతి పెరుగుతూ వస్తున్నాది. ఈ మార్పు

లేకపోతే యీ జగత్తే లేదు. పుట్టుటకు పూర్వము యీ జగత్తు లేదు. మరణించిన తరువాత యీ జగత్తు లేదు. కనుక జనన మరణములకు మధ్య మాత్రమే యీ జగత్తు చేరి వుంటున్నది. కనుక రెండు మంచిల మధ్యలోనే యీ చెడ్డ వుంటున్నది.

ఎవరికెవరు సంబంధము లేదు. దేహరీతిగా తండ్రులు, తాతలు ముత్తాతలు, మనుమలు అనిపిలువవచ్చు. ఇవి దేహసంబంధములు మాత్రమే.

దేహము పాంచ భౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్
దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్
మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ నా
దేహియె దేవదేవుడు మదిన్ తలపోయగ నాత్మరూపుడౌ

ఈ దేహము యేమిటి?

మలినపు కొంప రోగముల మ్రగ్గెడు సేవక గంప జాలసం
చలనము పొందు దుంప భవసాగర మీదగ లేనికంపు అం
బుల పాదితెప్ప చూడ మనమెచ్చుదలంపగ దేహమింకని
శ్చలమని నమ్మబోకు మనసా హరిపాదము లాశ్రయింపవే.

అన్నాడు ప్రహ్లాదుడు. దేహము నీటి బుడగ. మనస్సు పిచ్చికోతి. ఈ కోతిని నీవు అనుసరించవద్దు. నీవు చిత్తమును అనుసరించు. నీ చిత్తమును శుద్ధి చేసుకో. అప్పుడే దైవత్వము నీకు ప్రాప్తిస్తుంది. కనుకనే తిరుత్తుండాళ్వారు చిత్తశుద్ధితో నేను పూజ చేస్తున్నాను రామా నీవు లభించాలి నాకు. నిన్ను నేను ప్రేమించాను నన్ను నీలో చేర్చుకోమన్నాడు. కనుక పరమభక్తులైన వ్యక్తులు తమయొక్క ఆదర్శమును జగత్తుకు అందింపజేసి యీ విధమైన అనేక కష్టములకు నష్టములకు దుఃఖములకు, నిందలకు నిష్ఠూరములకు గురియైన మహనుభావులు. సామాన్య మానవులు వచ్చే సమయములో యేమీ లేరు. ఇంత బట్టైనా కట్టుకొని రారు. పోయే సమయములో ఎత్తసు యిచ్చిపోరు. ఇలాంటి వారు మన బంధువులు ఎట్లా అవుతారు. నిజముగా నీవారైతే ఎందుకు నీయొక్క సంబంధ బాంధవ్యములను గుర్తించుకోలేరు. కాని మధ్యలో యీ జగత్తునందు చేరి కూడి సంబంధించిన సంబంధము మాత్రమే కనుక ఎవరి జన్మము వారిదే. ఎవరి కర్తవ్యము వారిదే. తమ తమ కర్తవ్యాన్ని నిర్వర్తించుకొని సార్థకము గావించుకొనే మానవత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి.

ఇట్టి ఏకత్వమును, సత్యాన్ని, దివ్యత్వాన్ని ప్రబోధించి ప్రజలను ఆకర్షించి ఆనందింపజేసి వారిని పరిపాలించినవాడు బలిచక్రవర్తి. కనుక ఆ బలి చక్రవర్తి మోక్షమును పొందిన పవిత్రమైన దినమే యీ ఓణము దినము. వామనుడు పుట్టిన

215098610

దినమే యీ ఓణము దినము. తిరిగి ప్రతి సంవత్సరము కూడను వామనుడు నూతన అవతారములతో ప్రజాక్షేమమును, ప్రజాభిమానమును, ప్రజ ఆదర్శమును అందుకునే దినమే యీ ఓణం దినము. కనుక యీనాడు కేవలము ఆహార విహారాదుల చేత మాత్రమే తృప్తి చెందక ఆత్మానందముతో తృప్తి పొందే విధానమును గుర్తించాలి. ప్రహ్లాదుని తండ్రి యైన హిరణ్యకశిపుడు అనేక విధములుగా బోధించటానికి ప్రయత్నించాడు. బిడ్డను ఆదరించి అక్కున చేర్చి ఆనందింప చేసెడి తల్లి. తన యొక్క హరినామమునకు తల్లియేమైనా తోడ్పడుతుందో యేమోనని ఒకానొక దినము ఆ హింసలను భరించుకొనలేక తల్లి దగ్గరకు వెడతాడు. అప్పుడే తల్లి దగ్గర కూడను అతనికి ఒక విధమైన విరక్తి చేకూరుతుంది. కుమారుడు వచ్చిన తక్షణమే తండ్రి పెడుతున్న బాధలను వినటంచేత చాలా బాధపడింది లీలావతి. పరుగెత్తుకు వచ్చిన యీ ప్రహ్లాదుని కౌగలించుకొని అక్కున చేర్చుకొని చెప్పుతున్నది లీలావతి.

ఏల యిటుల తనయా వలదు హరిహరి అనబోకుమురా
ఏటి హరి యీ యిటు నువ్వు పలుక ఎవరు నేర్పిరిరా.....

దీనిని వినేటప్పటికే ప్రహ్లాదుడు ఓహో తండ్రి వ్యాధి తల్లికి కూడను ప్రాకినదే అని గుర్తించుకున్నాడు. ఒకరు నేర్పితే వచ్చేదాయిది. ఒకరివల్ల నేర్చుకునేది కాదు. నా అంతర్యామి నాకు బోధిస్తున్నది. అంతర్యామి నన్ను అనిపిస్తుండాది. అంతర్యామి ఆ యొక్క నారాయణుడే అన సత్యాన్ని తల్లి దగ్గర స్పష్టముగా చెప్పాడు. తల్లీ! హరినామము బయటనుండి కూరేది కాదు. లోపలనుండి పూరేది అన్నాడు. పెదిమల ద్వారా ఉచ్చరించిన హరినామము హరినామము కాదు హృదయమునుండి ఆవిర్భవించినదే హరినామము. జాగ్రత్ స్వప్న సుషుప్తి యందు కూడను యీ యొక్క ప్రహ్లాదుడు హరిని స్మరించేవాడు. అతని యొక్క రక్తమంతయు కూడను నారాయణుని యొక్క నామముతో లీనమై వుంటున్నాది.

అట్టి ప్రహ్లాదునకు ఒకరు నేర్పేవారా. మంచి కఠినమైన రాక్షసులను నియమించాడు ప్రహ్లాదుని శిక్షింప చేసే కోసమని హిరణ్యకశిపుడు. చండ, అమార్కుడు. వీరిని చూసేసరికే భయమవుతుంది పిల్లలకు. సూదైన కత్తులు ధరించారు. ముల్లకర్రలంతా చేత బూనారు. నారాయణా అని చెప్పినప్పుడంతా ఆ ముల్లు కర్రలతో పొడుస్తున్నారు. కానీ ఎన్ని బాధలు పెట్టినప్పటికిని, ఏ విధమైన హింసలు లభించినప్పటికిని తాను ఆ నామమును వదలలేదు. ఈ నాటి మానవులకు తాను సంకల్పించుకున్నదేదైనా కాకపోతే తక్షణమే భగవంతుని మార్చివేస్తారు. తన యొక్క అభీష్టములు నెరవేరకపోతే పటాలు తీసి పెట్టేస్తారు. ఇది తుచ్ఛమైన బుద్ధుల యొక్క తత్వము. ఇదే నిజమైన రాక్షసత్వము. కాని రాక్షసుడైన ప్రహ్లాదుడు కూడను పవిత్రమైన దైవత్వముగా తాను నిరూపిస్తూ వచ్చాడు. మానవత్వము, దానవత్వ

2150986ll

ము, దైవత్వము ప్రవర్తనలో వ్యక్తమవుతుండే గాని స్వరూపములో కాదు. ఈ బాధలు పెట్టే చండామార్కులు వారికి కూడను విసుగు పుట్టిపోయింది పాపం. ఏమి చేసినా ప్రహ్లాదుని మార్చలేకపోయారు. దేవుడంటే ఎవరు? హిరణ్యాకశిపుడే. హిరణ్యాకశిపుడే దేవుడని చెప్పమంటున్నారు యీ చండామార్కులు. కాదు కాదు నా దేవుడు నారాయణుడే. ఈ విధముగా చెప్పేటప్పటికి హిరణ్యాకశిపుని దగ్గరకు వచ్చారు పరుగెత్తి.

తన్నునిశాచరులు పొడవ దైత్యకుమారుడు మాటిమాటికో
పన్నగశాయీ! యో దనుజ భంజన! యో జగదీశ! యో మహా
పన్న శరణ్యా! యో నిఖిలపావన! యంచు నుతించెగాని తా
కన్నుల నీరు తేడు భయకంపసమేతుడు కాడు భూవరా!

ఇట్టి స్థిత ప్రజ్ఞత్వాన్ని ప్రకటించినవాడు ప్రహ్లాదుడు.

అతని పేరునందే వుంటున్నది యీ యొక్క తత్త్వము. ప్ర.హ్లా.ద అనగా ఆహ్లాదముతో నిండినవాడు ప్రహ్లాదుడు అని. అనగా ఆనందమయుడే ప్రహ్లాదుడు. నిత్యానందం, బ్రహ్మానందం, యోగానందం, పరమానందం, అద్వైతానందం, సచ్చిదానందం యీ విధమైన ఆనందముల లోపల సర్వమయ ఆనంద స్వరూపుడే యీ ప్రహ్లాదుడు. ఇట్టి ఆనందమును ప్రజలకు అందించి తాను అనుభవించి కేరళరాజ్యమునకు చక్కని కీర్తి తెప్పించిన చక్రవర్తులు యీ ప్రహ్లాద, బలిచక్రవర్తులు. సాక్షాత్ భగవంతుడే నిర్మించిన ప్రదేశమునందు తాము నివసించి పట్టణాములు కట్టుకొని జీవితాన్ని గడిపే కేరళ రాజ్య ప్రజలు యెంతో అదృష్టవంతులు. పరశురాముడు నిర్మించిన క్షేత్రము. బలిచక్రవర్తి యేలిన క్షేత్రము. ప్రహ్లాదుడు పుట్టిన క్షేత్రము. బలిచక్రవర్తి మోక్షమునకు ప్రయాణమైన క్షేత్రము. వామనమూర్తి అవతరించిన క్షేత్రము. ఇన్ని పవిత్రములతో కూడిన క్షేత్రము కనుకనే ప్రజల యొక్క హృదయము కూడను పవిత్రముగా, దివ్యముగా, భవ్యముగా ఆనందించాలని నేను ఆశిస్తూ ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.